# “నారాయణ” “నారాయణ”

## వైకుంఠంలో అడుగుపెట్టాడు నారదుడు.

## అక్కడ విష్ణుమూర్తి మెలికలు తిరిగిపోతున్నాడు.

## లక్ష్మీదేవి ఆందోళనగా చేతులు పిసుక్కుంటూంది.

“ఏమైందమ్మా?”

“ఏం చెప్పను నారదా! గంట నుండి ఇదే వరస. కడుపునొప్పి అని ఒకటే మెలికలు తిరిగిపోతున్నారు”.

“మందేమైనా వాడకపోయారా?”


“ఇది మామూలు మందులకు లొంగే నొప్పి కాదు నారదా! భూలోకంలో పాపం పెరిగిపోయింది. అందుకే నాకీ నొప్పి. నా నిజమైన భక్తుని కాలేయం ఉడకబెట్టి, ఆ కషాయం తాగితే గానీ ఈ నొప్పి తగ్గదు” ఒగర్చుకుంటూ అన్నాడు విష్ణుమూర్తి.

# ‘షూసింగ్ దబ్బే’ అను నెళ్ళూదింపు

**కథ**

## అంబల్ల జనార్దన్





“నారదా! నీవు త్రిలోక సంచారివి గదా! శ్రీవారి కోసం వారి నిజమైన భక్తుని కాలేయం తేలేవూ?” లక్ష్మీదేవి వేడుకుంది.

“తప్పకుండానమ్మా! భూలోకంలో పాపుల సంఖ్య ఎక్కువే అయినా, స్వామివారి భక్తులూ ఉన్నారు. ఒక్క నిజమైన భక్తుని కాలేయమైనా దొరక్కపోదు”.

ఆఘమేఘంగా నారదుడు ముంబయిలో అడుగుపెట్టాడు.

సురేఖ!

హిందీ సినిమా తార. గొప్ప విష్ణుభక్తురాలు. ఎన్నో మందిరాలకు విరాళాలిచ్చిన దాత, వారినికోసారి రామ మందిరంలో అర్చన చేయిస్తుంది. తోటి నటుడు ఆమె ప్రియుడు, ఇంకో నటి భర్త, తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే దేశంలోని ఎన్నో మందిరాలు సందర్శించి, తన మానస చోరుడు కోలుకోవాలని ప్రత్యేక పూజలు చేయించింది.

ఏ పుట్టలో ఏ పాముందో అని ప్రసిద్ధ సిద్ధి వినాయకుని ఆలయంలో అయిదు మంగళవారాలు, అర్చన చేయించింది.

తన అభిమానుల ప్రార్థనవల్లనైతేనేమి, ఆయుష్షు బలంతో నైతేనేమి, తన ప్రియురాలు భక్తితో చేసిన పూజల ఫలితంగా నేమి ఆ నటుడు పూర్తిగా కోలుకుని ఇప్పుడు మళ్ళీ నట జీవితంలో పుంజుకున్నాడు. నారదుడు సురేఖను కలుసుకుని విష్ణుమూర్తి అనారోగ్య విషయం చెప్పి, ఆమె కాలేయం ఇవ్వమని అడిగాడు.

గతుక్కుమంది సురేఖ. మొహంలో రంగులు మారాయి.

వరుస ఫ్లాపులతో తెరమరుగైన తను, ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. రెండు సినిమాలు హిట్టయ్యాయి. తోటి నటులతో సంబంధాలు సాగించి, బహు కష్టంతో ఒక పారిశ్రామిక వేత్తను పెళ్ళాడితే అతను అల్పాయుష్కుడయ్యాడు. ఇక వివాహం కూడదని ఇతర సంబంధాలతోనే తన తపనను తీర్చుకుంటోంది. ఇప్పుడిప్పుడే ఒక కొత్త సంబంధం మొగ్గ తొడుగుతోంది. జీవితం సుఖంగా ఉంది. ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తోంది. ఈ తరుణంలో తనువు చాలిస్తే? అమ్మో! మనసొప్పడం లేదు. అన్యమనస్కంగా ఉన్న ఆమె మొహంపై చిరునవ్వు మొలిచింది. ఆమెలోని నటి బయటికొచ్చింది.

“మీ వంటి మహానుభావులు మా ఇల్లు పావనం చేయడం నా పూర్వజన్మ సుకృతం నారదా! కానీ నేను మీరనుకున్నంత ఉన్నతురాలిని కాను. మీకు తెలుసు కదా! నేనున్నది గ్లామర్ ప్రపంచంలో. దానికి కొన్ని జిమ్మిక్కులు తప్పని సరి. నా భక్తి కూడా ప్రచారంలోని భాగమే. అలా మేం పత్రి కల్లో, టీవీల్లో నానితేగానీ మా పరపతి పెరగదు. జనానికి

మా నట జీవితం కంటే వ్యక్తిగత జీవితంపైనే ఆసక్తి. అది మేం క్యాష్ చేసుకుంటాం. మా సినీ పరిశ్రమలో అనర్థాలకు కొదవ లేదు. దానికి నేను మినహాయింపు కాదు. పరిశ్రమలో నా స్థానం నిలబెట్టుకోవడానికి, నానాగడ్డి కరవాల్సి వస్తుంది. అందుకని నన్ను మన్నించండి!"

త్రిలోక సంచారి నారదునికి ఆమె ఆధునిక భాష త్వరగా అవగాహనకు రాలేదు. బాగా శ్రమపడాల్సి వచ్చింది. "మీరు మీ వృత్తిలో ఏమి చేసినా అది వృత్తి ధర్మం. ఆ పాపం దేహానిదే కానీ మనసుది కాదు. దానివల్ల మీ స్వామి భక్తి తరగదు. నా ఉద్దేశంలో మీరు మంచి భక్తులు. మీ కాలేయంతో విష్ణుమూర్తి ఆరోగ్యం కుదుటపడుతుంది, మీ జన్మ సార్థకమవుతుంది. మీకు అంతకంటే కావలసింది ఏముంటుంది?"

సురేఖ తగ్గదలచుకోలేదు.

"మునీంద్రా! చెప్పాను గదా! నా భక్తి కూడా ప్రపంచంలోని భాగమేనని. అదీగాక నా పాప పంకిలమైన దేహపు కాలేయాన్ని, నా ఆరాధ్య దైవానికి అర్పితం చేసి ఇంకా పాపం మూట గట్టుకోలేను. జీవితంలో నేనింకా సాధించాల్సిందెంతో ఉంది. నా ఆశలను తుంచేయకండి. మీకు నిజమైన భక్తుడు కావాలంటే నాకు తెలిసి ప్రతాపచంద్రగారున్నారు. ఆయన గొప్ప పారిశ్రామికవేత్త. ఆయన్ని కలవండి".

"సరే తల్లీ! నువ్వన్నట్టు ప్రతాపచంద్రగారిని కలుస్తాను. నారదుడు తన దివ్యదృష్టి సారించాడు.

నిజమే! ప్రతాపచంద్ర గొప్ప రామభక్తుడు. తన విశాలమైన భవనంలో ఈశాన్య దిక్కున పాలరాయితో నిర్మించిన పూజా మందిరంలో రోజూ ఓ గంట ధ్యానం చేస్తాడతను. దేశంలో అతనికెన్నో ఫ్యాక్టరీలు ఉన్నాయి. అతడు ప్రతి రాష్ట్ర రాజధానిలో మందిరాలు నిర్మించాడు. తన పేరుమీద ఉన్న ట్రస్టు ద్వారా కట్టిన ఆ మందిరాల నిర్వహణ బాధ్యతలు అతని ఉద్యోగులు చూసుకుంటారు. ప్రతాపచంద్ర గ్రూపుకు చెందిన ప్రతి కంపెనీ తన లాభం నుండి కొంత శాతం ఆ మందిర ట్రస్టుకు విరాళంగా ఇస్తాయి. పాలరాయితో విశాలంగా కట్టిన ఆ మందిరాలు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆ మందిరాలు రామ మందిరాలుగా కాకుండా, ప్రతాపచంద్ర మందిరాలుగా ప్రజలలో ప్రాచుర్యం పొందాయి. అతనే తన పనికి కావలసిన సరైన వ్యక్తి" అని నిర్ధారణకు వచ్చాడు నారదుడు.

"నారాయణ నారాయణ" బావున్నారా ప్రతాపచంద్రగారూ! తన పడక గదిలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రతాపచంద్ర ఉలిక్కిపడ్డాడు. వేసిన తలుపులు వేసినట్టే ఉన్నాయి. ఈ పగటి వేషగాడు లోపలికెలా వచ్చాడా అని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు ప్రతాపచంద్ర. ముడుపుల కొరకు మాఫియా గ్యాంగుల పథకం కాదు గదా! లేక పోటీదార్ల కుట్రా? ప్రతాపచంద్ర నోరు వెళ్ళబెట్టాడు. అతని అనుమానం పసిగట్టిన నారదుడు...

"భయపడకండి! నేను పగటి వేషగాణ్ణి కాదు. మాయల మరాఠీని కాదు. మీ పోటీదార్ల మాఫియాల తొత్తునూ గాను, అసలు సిసలైన నారదుణ్ణే" అని నమ్మబలికాడు. ఆ వర్చస్సు చూసి ప్రతాపచంద్ర కుదుటబడ్డాడు. నారదుడు తను వచ్చిన పని చెప్పాడు.



ప్రతాపచంద్ర గుండె గుభేలుమంది. అసలే హృద్రోగం. దానికి తోడు నారదుడు చెప్పింది వినగానే గుండె మరింత వేగంగా కొట్టుకుంటోంది.

నారదుడు అతని ముఖ కవళికలను గమనించి, అక్కడున్న గ్లాసులో మంత్ర తీర్థం పోసి ఇచ్చాడు. ప్రతాపచంద్ర తేరుకున్నాడు.

"మహా మునీ! ఇంత పవిత్రమైన పనికి నన్ను ఎన్నుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. కానీ మీతో నేను అబద్ధం ఆడలేను. నేను చేసే దానధర్మాలు మా చార్టెడ్ అకౌంటెంట్ల సలహాతో చేసినవి. వాటిలో భక్తికన్నా ఇన్‌కమ్ టాక్స్ కలిసొచ్చే నిర్ణయాలదే పైచేయి. మీ నుండి దాచడమెందుకు? మా నల్లధనం తెల్లగా మార్చడానికి నా మందిర ట్రస్టు ఒక సాధనం. అంతే తప్ప నా చిత్తశుద్ధితో ప్రారంభించిన సంస్థ కాదది" నారదునితో అలా అన్నాడే కానీ లోపల ప్రతాపచంద్రకు గుబులుగానే ఉంది.

ఇలా అర్థాంతరంగా తను చనిపోవలసి వస్తే తన వ్యాపారం ఏం కాను? ఎంతో శ్రమతో, యుక్తి కుయుక్తులతో నెలకొల్పిన తన వాణిజ్య సామ్రాజ్యం కుప్పకూలదూ? ఎప్పటికైనా మృత్యువు తప్పదు. కానీ ఈలోగా తన కొడుకులకు వ్యాపార కిటుకులు నేర్పాలి. తన రహస్య ఎకౌంట్ల వివరాలు చెప్పాలి. పెద్దవాడిప్పుడే కొన్ని కంపెనీలు చూసుకుంటున్నాడు. చిన్నవాడు అమెరికాలో ఎం.బి.ఏ. చేస్తున్నాడు. ఇంకా కనీసం అయిదేళ్ళు అయితేగానీ తన వారసులకు సరి అయిన తర్ఫీదు ఇవ్వలేదు. కానీ ఇప్పుడు తప్పించుకునేదెలా? ఒక మెరుపు మెరిసింది. ప్రతాపచంద్ర పెదవిపై దరహాసం!

"నారదా! వ్యాపారంలో నేను చేసిన మోసాలు, నీ దివ్య దృష్టికి అగుపించే ఉంటాయి. అందుకని నన్ను వదిలేయండి. రుషికేష్‌లోని 'దిగంబర బాబా' మీకు కావలసిన వ్యక్తి. అతను మీ మాట తప్పక వింటాడు. తన కాలేయం ఇస్తాడు" నారదుడు రుషికేష్ వైపు బయలుదేరాడు.

'దిగంబర బాబా' ఆశ్రమం, వేల భక్తులతో వందల శిష్యులతో కిటకిటలాడుతోంది. ఆ పరిసరాల గాలి కూడా హరినామస్మరణతో మార్మోగుతోంది. నారదుడు పులకించిపోయాడు. తన శోధన ఫలించిందని సంతోషించాడు. అయినా రిస్కు తీసుకోదలచలేదు. మామూలు మనిషి వేషంలో ఆశ్రమంలో అడుగు పెట్టాడు. దినమంతా అక్కడ గడిపాడు. అక్కడి పవిత్ర వాతావరణంతో ముగ్ధుడయ్యాడు.

దినచర్య పూర్తి చేసుకుని బాబా తన శయన మందిరంలోని పట్టు పాన్పుపై విశ్రమించాడు. అదే తగిన సమయమని నారదుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. వేలాది భక్తుల సన్నిధిలో తన చిరు దరహాసంతో ఎంతో ప్రశాంతంగా ఉండే బాబా ఒక ఆగంతకుడు తన ఏకాంత మందిరంలోకి వచ్చేసరికి తొట్రుపడ్డాడు.

"మీరు...మీరు..."

"బాబాగారూ! నన్ను గుర్తు పట్టలేదా?"

బాబాకు ముచ్చెమటలు పట్టాయి. మనిషి వణికిపోతున్నాడు.


"లేదు లేదు ఎ...ఎవరు మీరు?"

"భయపడకండి! నేను ఆ నారాయణుని దూతను, నారదుణ్ణి. మీలాంటి జ్ఞానులు నన్ను గుర్తుపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అంటూ నారదుడు ఆ బాబాని మామూలు స్థితికి తీసుకొచ్చేసరికి తల

ప్రాణం తోకకొచ్చింది.

బాబాను కాస్త స్థిమితపరచి, తను వచ్చిన పని చెప్పాడు. బాబా కనక తన కాలేయమిస్తే విష్ణుమూర్తి జబ్బు నయమవగలదని నమ్మ బలికాడు.

బాబా గుండెలో రాయి పడింది. మళ్ళీ అతనికి అనుమానం పొడ చూపింది. తనను మట్టు పెట్టడానికి ఏ ఆశాఢభూతి లాంటి శిష్యుని పన్నాగమో అన్న భయం పట్టుకుంది. కాలింగ్ బెల్ నొక్కితే అది పని చేయలేదు. నారదుడు అతని మనసును కనుగొన్నాడు. తన దివ్యశక్తితో అతనిలో నమ్మకం కలిగించాడు. బాబాకు నమ్మకమైతే కుదిరింది గానీ తన కాలేయం ఇచ్చి దేహ పరిత్యాగం చేయడానికి మనసొప్పలేదు. నారదునికి నిజం చెప్పడానికి నిశ్చయించుకున్నాడు.



"ఆర్యా! నేను ఇక్కడ ఒక బాబాగానే కాకుండా కొందరు భక్తుల దృష్టిలో భగవంతుని అవతారంగానూ పూజింపబడుతున్నాను. నిజానికి నేను అధముల్లోకెల్లా అధముణ్ణి. ఈ ఆశ్రమం నీడలో ఎంతో ధన, కనక, వస్తు, వాహనాలు సంపాదించాను. ఎందరో అమాయక మహిళా భక్తులతో కామక్రీడలు సాగించాను. నా నమ్మకమైన అనుచరుల ద్వారా ప్రచారం చేయించి, నా మహిమలను నలుదిక్కులా చేరేలా శ్రద్ధ తీసుకున్నాను. వశీకరణ శక్తిని నా స్వార్థం కోసం వాడుకుంటున్నాను. ఇంతటి నీచుణ్ణి నా కాలేయం భగవంతునికి ఎలా సమర్పించను? నేను ఎన్నో పాపాలు చేశాను. భగవంతుని పేరుతో అపచారం చేశాను. కానీ తెలిసి తెలిసి ఈ ఘోర తప్పిదానికి పూనుకోలేను. పొంచి ఉన్న విపత్తు నుండి తప్పించుకోవడానికి తనను కించపరచుకోవడానికి వెనుకాడలేదు దిగంబర బాబా. నారదుడు నిరాశ చెందాడు. ఇంత పెద్ద భూలోకంలో కోట్ల ప్రజల్లో ఒక్కడంటే ఒక్కడు నిజమైన భక్తుడు దొరకలేదే! విష్ణుమూర్తి కడుపునొప్పి తీర్చలేకపోతున్నానే అని తల చుకుంటూ ఆ ఆశ్రమం నుండి బయట పడ్డాడు.

ఇక ఇలా కాదని మానవుల బాహ్య ఆచరణే కాక వారి ఆంతర్యాల వైపు దృష్టి సారించాడు నారదుడు. అతనికి ప్రతిచోటా భక్తిపేరిట దగా, మోసం, వంచన గోచరించాయి. విరక్తితో వైకుంఠానికి తిరుగుముఖం పట్టాడు.

వైకుంఠంలో విష్ణుమూర్తి పరిస్థితిలో మార్పు లేదు. బాధతో మెలికలు తిరుగుతూనే ఉన్నాడు.

నారదుణ్ణి చూడగానే లక్ష్మీదేవికి ప్రాణం లేచి వచ్చింది.

"వచ్చావా? నారదా! ఏదీ ఆ కాలేయం! ఇమ్ము. నా స్వామి వేదన భరించకుండా ఉన్నాను".

"క్షమించు దేవీ! ఎంత గాలించినా ఒక్క నిజమైన భక్తుడు దొరకలేదు. స్వామివారు సెలవిచ్చినట్టు భూలోకమంతటా పాపం రాజ్యమేలుతోంది. కపటంతో కుళ్ళిపోతోంది. ఇక దీన్ని స్వామివారే సరిదిద్దాలి. మరో అవతారం ఎత్తి మానవులను ఆ పాప పంకిలం నుండి కాపాడాలి".

"భూలోకంలో కాకపోయినా, నీవు త్రిలోక సంచారివి కదా! మరే లోకంలోనైనా ఒక్క భక్తుడు లేడా?"

"లేదు మాతా లేదు. ఇంద్ర లోకంలో అంతా ఇంద్రియ లోలురే. యమలోకమంతా పాపులతో నిండి ఉంది. ఇక మునులు, ఋషులంటారా! వారు కూడా ఏదో స్వార్థంతో తపస్సు చేస్తున్నారే తప్ప నిజమైన భక్తితో కాదు. తన శరీర భాగాన్నిచ్చే శిబి చక్రవర్తి లాంటి వారెవరూ నాకు గోచరించడం లేదు".

"అదేమిటి నారదా? వందల కోట్ల భక్తులలో ఒక్క అసలు సిసలు భక్తుడు లేడా? ఏమి ఈ కలియుగ మాయ?"

"నిజమే మాతా! ఈ యుగంలో స్వార్థం అష్టదిక్కులా వీరవిహారం చేస్తోంది. ప్రతివారూ తమ గురించే తప్ప వేరెవరినీ పట్టించుకోవడం లేదు. ఇతరులకు ఏమీ చేయడం లేదు. అధవా చేసినా దాంట్లోనూ ఏదో ఫలమాశించడమే తప్ప నిష్కామం కాదు.

"నారదా! సదా నీ నోటిలోనే నానే 'నారాయణ నారాయణ' ఊత పదమేనా"? అంత నొప్పితోనూ విష్ణుమూర్తి ఎలాగో గొంతు విప్పాడు.

నారదుడు ఒక్కసారిగా చతికిలపడిపోయాడు.

నోట మాట రావడం లేదు. కళ్ళు తేలవేసి లక్ష్మీదేవిని, విష్ణుమూర్తినీ అలా చూస్తూ ఉండిపోయాడు.

దేవదేవుని కడుపు నొప్పి మాయమైంది. అతను నారదుణ్ణి స్పృహలోకి తెచ్చి స్థిమితపరిచాడు.

"వత్సా! ఇందాక అన్నావే ప్రతివారూ తమ గురించే తప్ప వేరెవరినీ పట్టించుకోవడం లేదని! అది సరికాదు. ప్రతివారూ వేరేవాళ్ళు తమకు సహాయపడాలని అనుకుంటారు కానీ తాము వారికి ఏవిధంగా ఉపయోగపడాలా? అని అనుకోరు. నీవూ దానికి మినహాయింపు కాదు. ఇప్పుడు తెలిసిందా? నా కడుపు నొప్పి ఆంతర్యం? ఇదే జబ్బు భూలోకంలో విస్తరించింది. ప్రసాదానికి బలవంతులమే కానీ పనికి మీ అదృష్టం అంటూ అందరూ తీసుకునేవారే కానీ ఎవరూ వేరే వారికి 'ఇచ్చే' మనస్తత్వంతో లేరు. హక్కుల్ని మాత్రమే కోరుతూ బాధ్యతలను వేరే వారిపై నెడుతున్నారు. దాన్నే ఆధునిక భాషలో 'పాసింగ్ ద బక్' అంటారు.

ముఖ్యంగా ఈ నెట్టుడాట భూలోకంలో అదీ భారతదేశంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బాగా ప్రాచుర్యంలో ఉంది. నీవు నీ కలహ ప్రియతపై దృష్టి తగ్గించి, ప్రజల్లో వారి బాధ్యతపై కూడా శ్రద్ధ వహించేలా చూడు. ప్రజల్లో సౌహార్ద్రతను పెంపొం దించు. సమిష్టి కృషి ప్రాముఖ్యతను చాటు. అందరిలో అంతో కొంతో త్యాగ నిరతిని వికసింపజేయుము" విష్ణుమూర్తి క్లాసు తీసుకున్నాడు. తల ఊపుతూ ఏకతార మీటుతూ భారంగా బయటకు అడుగులు వేశాడు నా'ర'దముని.

"లేదు మాతా లేదు. ఇంద్ర లోకంలో అంతా ఇంద్రియ లోలురే. యమలోకమంతా పాపులతో నిండి ఉంది. ఇక మునులు, ఋషులంటారా! వారు కూడా ఏదో స్వార్థంతో తపస్సు చేస్తున్నారే తప్ప నిజమైన భక్తితో కాదు. తన శరీర భాగాన్నిచ్చే శిబి చక్రవర్తి లాంటి వారెవరూ నాకు గోచరించడం లేదు".

(చిన్నతనంలో విన్న ఒక కథా ఆధారంగా)